వ్యక్తిగత సెలవుపై కలెక్టర్ విజయకృష్ణన్


» జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవికి బాధ్యతలు

అనకాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ విజయకృష్ణన్ వ్యక్తిగత కారణాలతో ఆరు రోజులు సెలవు పెట్టారు. ఈ నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆమెకు ప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. దీంతో జాయింట్ కలెక్టర్ జాహ్నవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 15వ తేదీన విజయకృష్ణన్ తిరిగి విధుల్లో చేరతారు.

పాడి రైతుల నెత్తిన పాలు

సరఫరాలో స్వేచ్ఛ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- ఏ డెయిరీ ఎక్కువ రేటు ఇస్తే ఆ డెయిరీకి ఇచ్చుకోవచ్చు
- అమూల్‌కు మాత్రమే పాలు పోయాలన్న నిబంధన తొలగింపు
- కొత్తగా మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటు
- తొలిదశలో జిల్లాకు 15 సంఘాలు
- రూ.1.5 లక్షల విలువైన కిట్లు సరఫరా
- డీసీసీబీ ద్వారా పాడి రైతులకు రుణాలు


మహిళా పాల సహకార సంఘాలకు అందజేయనున్న పరికరాలు



విశాఖపట్నం/ అనకాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): **పాల సరఫరాలో రైతులకు స్వేచ్ఛ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన 'అమూల్'కు మాత్రమే పాలు పోయాలన్న నిబంధనను తొలగించింది. ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి సరఫరా చేసుకునేలా ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో తొలివిడత కొత్తగా 15 మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ సంఘాల ఏర్పాటు నుంచి నిర్వహణ, పాల సేకరణ, రైతులకు శిక్షణ, రుణాల మంజూరు తదితర అంశాలను ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) పర్యవేక్షించనున్నది.**

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డెయిరీలను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీని తీసుకువచ్చింది. అమూల్ డెయిరీ ప్రైవేటు సంస్థ అయినప్పటికీ ప్రతి జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలు, ప్రధానమైనచోట్ల పాల శీతలీకరణ సెంటర్లు ఏర్పాటు చేసింది. కలెక్టర్ల ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు అమూల్ కోసం పనిచేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి అమూల్‌కు పాలు పోసే రైతులకు రుణాలు మంజూరుచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ఉండే డెయిరీల కంటే అమూల్ ప్రయోజనాలకు పెద్దపీట వేయడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమూల్ డెయిరీ విషయంలో అధికారులపై ఒత్తిడి తగ్గింది.

గ్రామీణ మహిళలకు సాధికారిత కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కొత్తగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి జిల్లాలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో ప్రస్తుతం 86 పాల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో చురుగ్గాపనిచేసే తొలి 15 సంఘాలను గుర్తించి అక్కడ మహిళా డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. ప్రతి సంఘానికి కార్యదర్శి, ప్రమోటర్, కో-ప్రమోటర్‌తోపాటు మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంతకంటే ఎక్కువ మంది సభ్యులను చేర్చుకునే అవకాశం ఇచ్చారు. సభ్యులంతా పాడి పశువులు ఉన్నవారు వారై ఉండాలి. పాలు ఫలానా డెయిరీకి సరఫరా చేయాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ రేటు ఇచ్చే డెయిరీకి పాలు సరఫరా చేసుకునే స్వేచ్ఛ సంఘానికి ఉంటుంది. సంఘం నిర్వహణ, పాల సేకరణ, పాల నాణ్యత, ఇత్యాది అంశాల కోసం ప్రతి సంఘానికి ప్రభుత్వం రూ.1.5 లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్, యూపీఎస్, ఎనలైజర్, వెన్న శాతం కొలిచే పరికరం, తూనిక యంత్రం, డిస్‌ప్లే బోర్డు తదితర పరికరాలు సరఫరా చేస్తుంది. సంఘం నిర్వహణకు ప్రతి లీటరుకు కొద్దిమొత్తం సంబంధిత డెయిరీ చెల్లించాలని నిబంధన పెట్టారు. పాలుపోసే రైతులకు డీసీసీబీ శాఖల్లో ఖాతాలు ఓపెన్ చేస్తారు. డెయిరీ నుంచి పాల సొమ్ము బ్యాంకు ఖాతాలకు ... మిగతా 6వ పేజీలో

డీజిల్ అక్రమ వ్యాపారం

పూడిమడకలో బహిరంగంగానే విక్రయాలు

- సముద్రంలో వెళ్లే ఆయిల్ బార్జిల నుంచి అక్రమంగా కొనుగోళ్లు
- లీటరుపై రూ.20 వరకు తక్కువ..
- మత్స్యకార బోట్లతోపాటు ఇతర వాహనాలకు విక్రయం
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు


సముద్రంలో ప్రయాణించే ఆయిల్ బార్జి (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని పూడిమడకలో డీజిల్ అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సముద్రంలో ప్రయాణించే 'ఆయిల్ బార్జి'ల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, పూడిమడకలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. మరోవైపు సముద్రంలో ఇంజన్ బోట్లతో చేపల వేట సాగించే మత్స్యకారులు రాయితీపై డీజిల్ కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చే స్మార్ట్ కార్డులను తమ వ్యాపారానికి అనుకూలంగా వాడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..**

ఇంజన్ బోట్లు ఉన్న మత్స్యకారులకు ప్రభుత్వం లీటర్ డీజిల్‌కు తొమ్మిది రూపాయలు రాయితీ ఇస్తున్నది. ఇందుకోసం మత్స్యశాఖ వద్ద నమోదైన బోట్ల యజమానులకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందజేసింది. మత్స్యకారులు ఈ కార్డులతో బంకులకు వెళ్లి అక్కడ విక్రయించే ధరకన్నా రూ.9 తక్కువ చెల్లించి డీజిల్ కొనుగోలు చేయవచ్చు. ఒక్కో బోటుకు నెలకు 300 లీటర్ల డీజిల్‌ను రాయితీపై పొందవచ్చు. పూడిమడకలో ఎక్కువ మంది మత్స్యకారులు వుండడంతో ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో గతంలో ఒక పెట్రోలు బంక్‌ని ఏర్పాటుచేసింది. అలాగే మత్స్యకారులకు రాయితీపై డీజిల్ ఇవ్వడానికి అచ్యుతాపురంలో ఒక పెట్రోల్ బంక్‌కు మత్స్య శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. కాగా పూడిమడకలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకు మూతపడడంతో మత్స్యకారులు అచ్యుతాపురం వెళ్లి క్యాన్లతో డీజిల్ తెచ్చుకోవాల్సి వస్తున్నది. ఆటో చార్జీలను మత్స్యకారులు భరించాల్సి వస్తున్నది.


పూడిమడకలో మూతపడిన మత్స్యశాఖ ఆయిల్ బంకు


పూడిమడకలో అక్రమంగా డీజిల్ విక్రయించే దుకాణాల్లో ఇదొకటి!

ఇదిలావుండగా పూడిమడకలో చాలా కాలం నుంచి డీజిల్ అక్రమ వ్యాపారం సాగుతున్నది. వీరు ఇటు మత్స్యకారుల నుంచి అటు సముద్రంలో వెళ్లే ఆయిల్ బార్జిల నుంచి డీజిల్ తక్కువ రేటుకు కొనుగోలు చేసి, ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు. విశాఖ నుంచి సముద్ర మార్గంలో నౌకల ద్వారా డీజిల్ రవాణా అవుతుంది. వీటిని ఆయిల్ బార్జిలుగా పిలుస్తారు. ఇటువంటి నౌకలు తరచూ పూడిమడక సముద్రమార్గం గుండా వెళుతుంటాయి. విశాఖపట్నంలో ఉన్న దళారులు పూడిమడకలో డీజిల్ అక్రమ వ్యాపారులతో ఎల్లప్పుడూ టచ్‌లో ఉంటారు. విశాఖపట్నంలో డీజిల్‌తో షిప్ బయలు దేరిన వెంటనే పూడిమడక వ్యాపారులకు సమాచారం అందుతుంది. వీరు బోటులో బయలుదేరి సముద్రంలో నిర్దేశిత ప్రదేశం వద్ద ఖాళీ డ్రమ్ములతో సిద్ధంగా వుంటారు. ఆయిల్ బార్జి సిబ్బంది డీజిల్‌ను మార్కెట్ ధర కన్నా లీటరుకి రూ.20 వరకు తక్కువకు ఇస్తున్నారు. అక్రమార్కులు డీజిల్‌ను పూడిమడక తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు.

పూడిమడకలో మత్స్య శాఖ గతంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు మూతపడడంతో మత్స్యకారులు డీజిల్ కోసం అచ్యుతాపురం వెళ్లాల్సి వస్తున్నది. దీనివల్ల అదనపు ఖర్చులు అవుతుండడంతో పూడిమడకలోని డీజిల్ అక్రమ వ్యాపారులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మత్స్యకారుల నుంచి స్మార్ట్ కార్డులను తీసేసుకుని, వారికి ప్రభుత్వం ఇచ్చేరాయితీతో డీజిల్ విక్రయిస్తున్నారు. దీనివల్ల తమకు రవాణా చార్జీలు ఆదా అవుతాయని మత్స్యకారులు భావిస్తున్నారు. అయితే మత్స్యకారుల నుంచి తీసుకున్న స్మార్ట్‌కార్డులతో సదరు వ్యాపారులు అచ్యుతాపురంలోని బంకు నుంచి రాయితీపై డీజిల్ కొనుగోలు చేసి, వాహనదారులకు విక్రయిస్తున్నారు. పూడిమడకలో డీజిల్ అక్రమ వ్యాపారం బహిరంగంగా సాగుతుండగా పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.


ఆభరణాల అలంకరణ అనంతరం అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల మోదకొండమ్మకు నూతన ఆభరణాలు

- 27 కిలోల వెండితో కవచం, చేయి తొడుగులు, ఢమరుకం, ఖడ్గం
- ఎనిమిది తులాల బంగారంతో శతమానాలు

మాడుగుల, మే 8 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారికి నూతనంగా తయారు చేయించిన బంగారం, వెండి ఆభరణాలను గురువారం అలంకరించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన వెండితోపాటు అమ్మవారికి ఉన్న పురాతన వెండి ఆభరణాలు కరిగించి మొత్తం 27 కిలోల వెండితో కొత్తగా కవచం, చేయి తొడుగులు, ఢమరుకం, ఖడ్గం చేయించారు. అదే విధంగా ఎనిమిది తులాల బంగారంతో శతమానాలు చేయించారు. వెండి ఆభరణాల విలువ రూ.33 లక్షలు, బంగారం శతమానం రూ.9 లక్షలు వుంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. మాడుగుల పేరుచెబితే మొదటిగా గుర్తుకు వచ్చేది మోదకొండమ్మ అమ్మవారేనని, అందరికీ ఎల్లవేళలా అమ్మవారి ఆశీసులు ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడయ్యనాయుడు, దేవరాపల్లి శ్రీను, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, పుప్పాల లక్ష్మీనారాయణ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న వ్యాధులు!

'ఆరోగ్య ఆంధ్ర' సర్వేలో వెలుగుచూసిన వైనం

- 18 ఏళ్లు దాటిన 10,86,456 మందికి స్ర్కీనింగ్
- పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ బాధితులు
- కాలేయ, శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులు సైతం..
- తదుపరి పరీక్షలు, వైద్య సేవల కోసం ఆస్పత్రులకు రిఫర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. 'ఆరోగ్య ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇంతవరకు 18 ఏళ్లు దాటిన 10,86,456 మందికి స్ర్కీనింగ్ పూర్తి చేశారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి రుగ్మతలతో పలువురు బాధపడుతున్నట్టు గుర్తించారు.


నాతవరం పీహెచ్‌సీ పరిధిలో ఎన్‌సీడీ సర్వే నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంతి, వైద్య బృందం

విజన్-2047లో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన వ్యాధులను గుర్తించి, అవి ప్రబలడానికి గల కారణాలపై ప్రభుత్వం 'ఆరోగ్య ఆంధ్ర' నినాదంతో గత ఏడాది నవంబరు 14న తేదీన నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వే ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని పది రకాల వ్యాధులు, ప్రజల ఆహారపు అలవాట్లుపై వైద్య బృందాలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. మధుమేహం, బీపీ, గుండె, కిడ్నీ, కాలేయం, శ్వాసకోశ, క్యాన్సర్ తదితర బాధితులను గుర్తించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో 18 ఏళ్ల నిండిన 10,86,456 మందికి స్ర్కీనింగ్ పూర్తి చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించిన వివరాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చాపకింద నీరులా వ్యాధులు విస్తరిస్తున్నాయని స్పష్టమవుతున్నది. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోకపోవడం, వ్యాధి ముదిరే వరకు నిర్ధారణ కాకపోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నట్టు సర్వేలో తేల్చారు. రక్తపోటు(బీపీ)తో బాధపడుతున్నవారు 7,141 మంది ఉండగా వీరిలో 4 వేల మందికిపైగా మహిళలే ఉన్నారు. మధుమేహం (షుగర్) బాధితులు 5,493 మంది ఉన్నట్టు చెబుతున్నారు. వీరిలో కూడా మహిళలే ఎక్కువగా ఉన్నట్టు తేల్చారు. ఇక ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్ మహమ్మారి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వుంది. ధూమపానం, గుట్కా, పాన్ పరాగ్ వంటివి నమలడం వల్ల వచ్చే నోటి క్యాన్సర్ బాధితులు 63 మంది ఉన్నట్టు ప్రాథమిక పరీక్షల్లో గుర్తించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో 30 మంది, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో 16 మంది బాధపడుతున్నట్టు నిర్ధారించారు. గుర్తించారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 52 మందిని తదుపరి పరీక్షల కోసం ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసులు గతం కంటే కాస్త తగ్గుముఖం పట్టినా.. పూర్తిగా అదుపులోకి రాలేదని వైద్యులు చెబుతున్నారు. ఇంకా కాలేయ, శ్వాసకోశ, నరాల బలహీనత సంబంధిత సమస్యలు వున్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు.

రైస్ పుల్లింగ్ ముఠా అరెస్టు

- రూ.10 లక్షల నకిలీ నోట్లు, రూ.2.6 లక్షల అసలు నోట్లు స్వాధీనం
- సీతారాముల పట్టాభిషేకం నాణేనికి మహిమలు ఉన్నాయంటూ మోసం
- అమాయకుల నుంచి డబ్బులు వసూలు
- విజయనగరానికి చెందిన ముగ్గురి అరెస్టు
- అరకులోయకు చెందిన ఇద్దరు పరారీ


నకిలీ నోట్లు చూపుతున్న సీఐ రేవతమ్మ. వెనుక నల్లటి ముసుగులో వున్న నిందితులు

నర్సీపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ ముఠాకు చెందిన ముగ్గురిని నర్సీపట్నం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు. పోలీసులు పట్టుకున్న వారి నుంచిరూ.10 లక్షలు నకిలీ నోట్లు (పిల్లలు ఆడుకునే కరెన్సీ), రూ.2.6 లక్షలు అసలు నోట్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కారుని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను రూరల్ సీఐ రేవతమ్మ గురువారం రాత్రి ... మిగతా 6వ పేజీలో

పోలీసుల విస్తృత తనిఖీలు

- రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోదాలు
- అనుమానాస్పద వ్యక్తుల గురించి ఆరా
- జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

అనకాపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తయమ్యారు. జమ్ము, కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల పర్యాటకుపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలతో భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో గురువారం రాత్రి డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా నాయకత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి అనకాపల్లి రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానస్పద వ్యక్తుల గురించి ఆరా తీశారు. లాడ్జిలు, హోటళ్లల్లో బసచేసిన వారి వివరాలను సేకరించారు. జాతీయ రహదారిపై డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే.. తక్షణమే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్పీ తుహిన్‌సిన్హా జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాహనాల తనిఖీల్లో డీఎస్పీతోపాటు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ డి.ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అనకాపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రావణి, సీఐ, ఎస్ఐలు


పాయకరావుపేటలోని ఒక లాడ్జిలో బస చేసిన వారి లగేజీని తనిఖీ చేస్తున్న పోలీసులు

పాయకరావుపేటలో..

పాయకరావుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాయకరావుపేట పోలీసులు గురువారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. సీఐ అప్పన్న ఆధ్వర్యంలో ఎస్ఐ పురుషోత్తం, సిబ్బంది కలిసి పట్టణంలోని పలు లాడ్జిలు, హోటళ్లలో సోదాలు నిర్వహించారు. వీటిల్లో బసచేసిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. లగేజీని కూడా తనిఖీ చేశారు. లాడ్జిలో బస చేసే ప్రతి ఒక్కరి వివరాలు తెలుసుకుని, చెక్ చేసుకున్న తరువాతే గది అద్దెకు ఇవ్వాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఏమాత్రం అనుమానం వచ్చినా తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు జాతీయ రహదారిపై పలు కూడళ్లతోపాటు పట్టణంలోని వివిధ సెంటర్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ అప్పన్న మాట్లాడుతూ, ఎస్పీ ఆదేశాల మేరకు అర్ధరాత్రి దాటే వరకు పాయకరావుపేట పట్టణంతోపాటు గ్రామాల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

అప్రోచ్ రోడ్డును పరిశీలించిన కూటమి నేతలు



పోలవరం కాలువపై అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన పార్టీల నేతలు

ఎలమంచిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలోని పోలవరం కాలువపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం చొరవతోనే సాధ్యమైనట్టు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను అన్నారు. పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం ప్రాంతాలకు ప్రధాన రోడ్డు మార్గంలోని పోలవరం కాలువపై బ్రిడ్జిని అప్రోచ్ రోడ్డును పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారన్నారు. ఈ స్థితిలో కూటమి నేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. ఈ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని గురువారం టీడీపీ, జనసేన పార్టీల నేతలు బొద్దపు రమణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు బొద్దపు నాగేశ్వరరావు, గణేశ్, పల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

ఎలమంచిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. గురువారం లైనుకొత్తూరులో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ కొండలరావు, నేతలు పాల్గొన్నారు.

చదువుపై బాగా శ్రద్ధ చూపాలి

మునగపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ చదువుపై శ్రద్ధ చూపాలని విశ్రాంతి ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన చేశారు. చదువు సంస్కారంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎంతగానో దోహదంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. మునగపాక సంతబయల ప్రాంతంలో ఉన్న గౌతమి పఠన మందిరం, గవర్ల అనకాపల్లిలో కామ్రేడ్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం వేసవి శిక్షణ తరగతులు జరిగాయి.

శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు

మునగపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూలపేట శ్మశానవాటికలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టినట్టు సర్పంచ్ బీశెట్టి గంగ అప్పలనాయుడు తెలిపారు. జేసీబీతో తొలగింపు పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

20న సార్వత్రిక సమ్మె

మునగపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 20న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సహకార సంఘం ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, రామలక్ష్మి, పార్వతి, శాంతి, సన్యాసిరావు ఉన్నారు.

ఎలమంచిలి అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. గురువారం సుమారు రూ.75 లక్షల వ్యయంతో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మంత్రిపాలెం, శేషుకొండ కాలనీ, కొత్తపాలెం, తెరువుపల్లి ప్రాంతాల్లో ఎన్ఎస్‌టీపీ (నేచురల్ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు)లు నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. మురుగు నీటి శుద్ధి ప్లాంట్లతో మరింత ప్రయోజకరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ చొరవతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, టిపిఓ శ్రీలక్ష్మి, స్థానిక కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు. మంత్రిపాలెంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన నేతలు పాల్గొనగా, వార్డుకు చెందిన కొందరు టీడీపీ, జనసేన పార్టీల ప్రధాన నేతలు హాజరు కాకపోవడం విశేషం.



మంత్రిపాలెంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం: ప్రభుత్వ పరంగా అవకాశాలను అందిపుచ్చుకుని ప్రతి ఒక్కరూ అబివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. స్థానిక ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పేదరిక నిర్మూలన సంస్థ (డీఆర్‌డీఓ) ద్వారా అమలు జరుగుతున్న పథకాలపై అవగాహన, సందేహాల నివృత్తి కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, ఉద్యాన, పశుసంవర్థక, ఎంఎస్ఎంఈ, వెలుగు, విద్య, వైద్య శాఖల ద్వారా అమలు జరుగుతున్న పథకాలు, అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శిరీషా రాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి లీడ్‌బ్యాంక్ అధికారి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన రావు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి, నైపుణ్య శిక్షణ జిల్లా అధికారి గోవిందరావు లతో పాటు కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాస రావు, రాజాన సన్యాసి నాయుడు, బైలపూడి శ్రీరామ దాసు, మోటూరు శ్రీవేణి, కరెడ్ల సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

హెచ్ఎంఐఎస్ఐ ఏఎన్ఎంలకు శిక్షణ



ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తున్న ఎంపీహెచ్ఎస్ ధనరాజు

రాంబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో గురువారం హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (హెచ్ఎంఐఎస్ఐఎస్)పై గురువారం ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.వెంకటేష్, ఎంపీహెచ్ఎస్ సిహెచ్ ధనరాజు పలు అంశాలను వివరింరు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనీల్‌కుమార్, ఎంపీహెచ్ఇఓ రఘునాథస్వామి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు..

కిశోర వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు రమ్య

మునగపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లవరం గ్రామ శివారు కుంచవానిపాలెంలో కిశోర వికాసంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ జి ల్లా కమిటీ సభ్యురాలు రమ్య మాట్లాడుతూ బాలల సంరక్షణలో ప్రతి ఒ క్కరూ భాగస్వాములుకావాలన్నారు. బాలికల అక్రమ రవాణాతో పాటు వీధి బాలికల రక్షణ కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ మేరీబా, సర్పంచ్ ఇందల హేమలత, కార్యదర్శి ఎస్.సూర్యదేవి బి.వసంతపాల్గొన్నారు.

ఘనంగా మరిడి మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

మునగపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదగిరిపాలెంలో మరిడి మహాలక్ష్మి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విగ్రహం ప్రతిష్ఠించారు. అమ్మవారిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మునిసిపాలిటీ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశరాం, వైసీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. వీరికి కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అలాగే, మునగపాక పేటకట్టు రైతు మూల ప్రాంతంలో ఉన్న కొత్త మహలక్ష్మి పండగను ఆ ప్రాంత రైతు కుటుంబీకులు జరుపుకున్నారు. అమ్మ వారికి పూజలు చేశారు.



వాడ్రాపల్లిలో రామాలయ శిఖరంపై కలశం ఆవిష్కరణ

రైతులు పురోగతి సాధించాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



రామారాయుడుపాలెంలో వరిని పరిశీలిస్తున్న మోహనరావు

ఎలమంచిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో రైతులు పురోగతి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. గురువారం మండలంలోని రామారాయుడు పాలెం, పోతిరెడ్డి పాలెం గ్రామంలో ఆయ పర్యటించారు. రామారాయుడు పాలెంలో తోట గణేష్ కు చెందిన వరి మినీ కిట్ ఎన్ఎల్ఆర్ 3648 రకం వరి పైరును పరిశీలించారు. ఈ కొత్త రకం విత్తనంతో పురుగు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులకు సూచించారు. తురంగల పాలెం, పోతిరెడ్డిపాలెంల్లో గంటి చేలను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో డివిజన్‌లోని వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓలు సుమంత, సౌజన్య, మోహనరావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శు క్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. పూడిమడక, చిప్పాడ, కడపాలెం, మడుతూరు, తంతడి, రాజాన పాలెం, వాడపాలెం, అంగవానిపాలెం, దాసరి పాలెం, యాత పాలెం, ఎరికిరెడ్డి పాలెం వినియోగదారులు సహకరించాలని కోరారు.

మునగపాక పరిధిలో..

మునగపాక: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ శరగడం జగదీష్ తెలిపారు. మునగపాక, నాగులాపల్లి, గంగాదేవిపేట, ఒంపోలు, ఉమ్మలాడ, వాడ్రాపల్లి, నాగవరం, పాట్లిపల్లి ప్రజలు గమనించాలని కోరారు.



మరిడి మహలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే విజయకుమార్

రేగుపాలెంలో మరిడిమాంబ జాతర

ఎలమంచిలి: రేగుపాలెంలో గురువారం మరిడిమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్థానిక నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రామాలయ శిఖరంపై కలశం ఆవిష్కరణ

మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామం పెదరామాలయం శిఖరంపై పసిడి కలశం ఆవిష్కరణ వైభవంగా జరిగింది. వేద పండితులు వెలవలపల్లి కోటేశ్వరశర్మ పర్యవేక్షణలో గురువారం ఈ కలశాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ఆధ్యాత్మిక ప్రచార ధర్మకర్త పెతకంశెట్టి రామజోగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మళ్ల వరహా నర్సింగరావు, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల శేషు, మహిళలు పాల్గొన్నారు.

పాడి రైతుల నెత్తిన పాలు

... 5వ పేజీ తరువాయి

జమ చేస్తారు. పాల సేకరణ ప్రారంభం తరువాత పశువులకు దాణా కోసం ప్రతి రైతుకు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కాగా అన్ని జిల్లాల్లో 1964 సహకార సంఘాల చట్టం నిబంధనల మేరకు మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రామిబివృద్ధి సహకార సమాఖ్య ప్రతినిధి రాకేశ్ తెలిపారు. సంఘాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతుందని, త్వరలో పాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండే డెయిరీలకు రైతులు పాలు విక్రయించవచ్చునని, ఈ విషయంలో ఎటువంటి ఒత్తిడి, షరతులు లేవన్నారు.

రైస్ పుల్లింగ్ ముఠా అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

నర్సీపట్నం రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల దాటిన తర్వాత నెల్లిమెట్ట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చింతపల్లి వైపు నుంచి వస్తున్న కారుని ఆపారు. వెంటనే ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పరారయ్యారు. కారులో వున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.10 లక్షల నకిలీ నోట్లు (పిల్లలు ఆడుకునే నోట్లు), రూ2.6 లక్షలు అసలు నోట్లు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరానికి చెందిన నిమ్మల మనోహర్, తమ్మినేని సుమంత్‌కుమార్, నిమ్మల మన్మథగా గుర్తించారు. వీరిని స్టేషన్‌కు తీసికొచ్చి విచారించారు. ఏజెన్సీ గిరిజనులను లక్ష్యంగా చేసుకొని రైస్ పుల్లింగ్ నాణెం పేరుతో డబ్బులు సంపాదిస్తున్నట్టు చెప్పారు. సీతారాముల పట్టాభిషేకం బొమ్మతో వున్న నాణేనికి ఎన్నో మహిమలు వుంటాయని, ఆ నాణెం కోట్లాది రూపాయల విలువ చేస్తుందని నమ్మిస్తామని చెప్పారు. దీంతో తమ మాటలు నమ్మి నాణెం కొనడానికి ఆసక్తి చూపుతారని, నాణెం కొనుగోలు చేస్తామని చెప్పిన వారికి సెల్ ఫోన్‌లో ఫొటో చూపించి అడ్వాన్స్‌గా కొంత సొమ్ము తీసుకుంటామని తెలిపారు. త్వరలో నాణెం పంపుతామని చెప్పి అక్కడి నుంచి ఉడాయిస్తామని, సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తామని చెప్పారు. కాగా కారును ఆపి తనిఖీ చేసేటప్పుడు పరారైన ఇద్దరు వ్యక్తులు అరకులోయకు చెందిన వారిగా గుర్తించామని, రైస్ పుల్లింగ్ నాణెం కేసులో వీరిని ఏ-1, ఏ-2గా గుర్తించామని సీఐ తెలిపారు. వీరి కోసం గాలిస్తున్నామని, వీరు పట్టుబడితే రైస్ పుల్లింగ్ నాణేం పేరుతో మోసపోయిన బాధితులు ఎవరో తెలుస్తుందని సీఐ చెప్పారు.

గ్రేడ్-2 హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాలు విడుదల

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన స్కూలు అసిస్టెంట్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఇంకా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ పోస్టుల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితా కూడా విడుదల చేశామని గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాలు 'సైట్స్‌గూగూల్.కామ్,సైట్స్. డీఈవో వైజాగ్-2' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలలోగా తగిన ఆధారాలతో తెలియజేయాలన్నారు. అభ్యంతరం వ్యక్తంచేసిన ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయిరాలి పేరు, ప్రస్తుతం పనిచేస్తున్న హోదా, ఎక్కడ పనిచేస్తున్నారు? స్కూలు యూడైస్ కోడ్, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలని సూచించారు. అభ్యంతరాలు మార్పు చేయడానికి కావల్సిన ఆధారాలు, సాక్ష్యాలు తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు.

అమ్మ లాలన.. ఉద్యోగ పాలన

ఉపాధి పనులను పర్యవేక్షిస్తూ..

బిడ్డను సాకుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ నూర్జహాన్

ఆమె పేరు నూర్జహాన్.. సీహెచ్‌బీ అగ్రహారం పంచాయతీ పరిధిలో ఉపాధి పనులను పరిశీలించే ఫీల్డ్ అసిస్టెంట్.. ఆమెకు ఏడాది వయస్సున్న బాబు వున్నాడు. సమయానికి ఆ చిన్నోడికి ఆలనా, పాలనా చూసేవారు లేక తనతోపాటు ఉపాధి పనులు జరిగే చోటికే రోజూ తీసుకెళ్తున్నారు. ఉపాధి పనులు జరుగుతున్న చెరువు గట్టుపై వున్న చెట్టుకు బిడ్డ కోసం ఊయల కట్టి, మరో వైపు ఉపాధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నది. పేగు బంధానికి, ఉద్యోగ బాధ్యతకు ఒకేసారి న్యాయం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ అంకితభావాన్ని పలువురు అభినందిస్తున్నారు. -ఆంధ్రజ్యోతి/నక్కపల్లి



పనిచేసే చోటే పిల్లాడికి ఊయల కట్టిన దృశ్యం



ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉపాధి పనుల బాధ్యతలు నిర్వహిస్తున్న నూర్జహాన్

భారత్ ప్రతీకార చర్య గర్వించదగినది : తోట నగేశ్

పాయకరావుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి బదులుగా ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ ప్రతీకార చర్య తీసుకోవడం గర్వించదగ్గ విషయమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి ఐడీ కార్డులు, సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని సైనికులకు ఎల్లప్పుడూ మనమంతా అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇంజరపు సూరిబాబు, దేవాది మంగాదేవి, ఐఎస్.మూర్తి, పెంకే శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న

రిమాండ్ ఖైదీ పరారీ

నిందితుడు విజయవాడ వాసి

ఆరిలోవ (విశాఖపట్నం), మే 8 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీ ఒకరు పోలీసుల కళ్లుగప్పి పరారైనట్టు విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన నామాల నాగరాజు గత నెల విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో గల ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అతడిని పట్టుకోవడానికి పోలీసులు విజయవాడ వెళ్లారు. పోలీసులను గమనించిన నాగరాజు తప్పించుకునే క్రమంలో రెండంతస్థుల మేడపైనుంచి దూకాడు. దీంతో వెన్నుపూసకు గాయాలయ్యాయి. కదలలేని స్థితిలో ఉన్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని తొలుత చికిత్స అందించి, అనంతరం ఏప్రిల్ 13న కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నాగరాజుకు రిమాండ్ విధించింది. అయితే తీవ్ర గాయాల పాలైన అతడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ ప్రిజన్ సెల్‌లో ఉంచి ఏప్రిల్ 19 నుంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు గురువారం శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 7:30 గంటల సమయంలో టిఫిన్ చేయడానికి చేతికి ఉన్న బేడీలను విధుల్లో ఉన్న ఏఆర్ పోలీసులు తొలగించారు. కొంతసేపటి తర్వాత పోలీసులు కళ్లుగప్పి నాగరాజు అక్కడ నుంచి అదృశ్యమైనట్టు ఏఆర్ సిబ్బంది తన దృష్టికి తెచ్చినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా, 16 రోజుల క్రితం ఇదేవిధంగా కోర్టు నుంచి వస్తున్న ఒక రిమాండ్ ఖైదీ పారిపోయాడు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తాజాగా ఇప్పుడు మరో రిమాండ్ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోవడం విస్మయం కలిగిస్తోంది.

వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

నక్కపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ హోమాలు నిర్వహించి, అష్టోత్తరశతనామార్చన పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. కోలాట ప్రదర్శనలు, బాణసంచా ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గోతులమయం వెల్చూరు రోడ్డు

▸▸ ఆరేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం

▸▸ పట్టించుకోని పాలకులు, అధికారులు

రాంబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకవలాపల్లి వెళ్లే రోడ్డు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది. ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు దుస్థితి గత ఆరేళ్లుగా అధ్వానంగా ఉన్నప్పటికీ గత వైసీపీ, ప్రస్తుత కూటమి పాలకులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వేల్చూరు రోడ్డు పూర్తిగా శిథిలమై, గోతులమయమై, రాళ్లు తేలిపోయి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు భయపడుతున్నారు. వర్షాకాలంలో గొయ్యిల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణం ప్రమాదభరితమైందని వాహనచోదకులు చెబుతున్నారు. రోడ్డు పరిస్థితిని పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం మరమ్మతులైనా చేపట్టలేదని వెల్చూరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పందించి వేల్చూరు రోడ్డును బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న సంతపాలెం నుంచి వెల్చూరు వెళ్లే రోడ్డు

ఆర్మీకి హాకీ క్రీడాకారుల సెల్యూట్

▸▸ నక్కపల్లిలో సైన్యానికి సంఘీభావ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న నక్కపల్లి హాకీ క్రీడాకారులు

నక్కపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌పై భారత్ ఆర్మీ జరిపిన సిందూర్ ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల సైన్యానికి మద్దతుగా నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ క్రీడాకారులు గురువారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. సెల్యూట్ ఇండియన్ ఆర్మీ నినాదంతో హాకీ గ్రౌండ్ నుంచి పురవీధుల్లో హాకీ క్రీడాకారులు త్రివర్ణపతాకాలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, సెక్రటరీ కొల్నాటి తాతాజీ, రామచంద్రరావు, ప్రశాంత్, శివాజీ, వెంకట రమణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి, వేంపాడు ఆటో స్టాండ్ల వద్ద ఆటో డ్రైవర్లకు గురువారం ఎస్ఐ సన్నిబాబు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సులు వున్న వారు మాత్రమే ఆటోలు నడపాలని, అతివేగంగా డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదకరమని చెప్పారు. కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు



సాయంత్రం హైవే పక్కన నిలిచిపోయిన భారీ ట్రాలర్ లారీలు

నక్కపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): భారీ ఐరన్ లోడుతో వున్న వాహనాలు గురువారం నక్కపల్లి హైవేపై కన్పించాయి. రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఈ భారీ ట్రాలర్ లారీకి దాదాపుగా 80 చక్రాలుండడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. ఈ లారీలు నెమ్మదిగా హైవేపై నడుస్తుండడంతో పలు సందర్భాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాయంత్రం వేంపాడు హైవే సమీపాన వీటిని నిలిపివేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ



అయ్యప్పస్వామికి పూలు చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు

నర్సీపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం పక్కన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి, దుర్గాదేవి విగ్రహాలు, యంత్ర పునః ప్రతిష్ఠ కార్యక్రమాలను గురువారం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలోని గర్భగుడిలో యంత్ర స్థాపన అనంతరం అయ్యప్పస్వామి విగ్రహం, ఆలయం ప్రవేశ ద్వారం వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సమయంలో భక్తులు నవరత్రాలు, రాగి యంత్రం వేసి పూజలు చేశారు.

రిజర్వు ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత అరెస్టు

» సబ్ రిజిస్ట్రార్‌ను బ్లాక్ మెయిల్ చేయడంలో నకిలీ ఏసీబీ సీఐకి సహకరించారని అభియోగం

» 22 వరకు రిమాండ్



స్వర్ణలత (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.స్వర్ణలతను పీఎం పాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన బలగా సుధాకర్ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి...ఏసీబీ సీఐనని చెప్పి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని డబ్బులు డిమాండ్ చేయడంతో పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన సుధాకర్...కార్యాలయంపై తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కేసు కట్టకుండా ఉండాలంటే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ ఒక ఫోన్ నంబర్‌కు కాల్ చేసి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణితో మాట్లాడించారు. 'సీఐ గారు చెప్పినట్టు చేయండి. అంతా ఆయన చూసుకుంటారని' ఆ మహిళా అధికారి చెప్పారని పీఎం పాలెం పోలీసులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పీఎం పోలీసులు...ఏసీబీ ఉన్నతాధికారిగా పేర్కొంటూ ఎవరితో మాట్లాడించారనే దానిపై విచారణ చేపట్టారు. ఆ నంబర్ గతంలో విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి, ప్రస్తుతం బాపట్లలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న స్వర్ణలతదిగా గుర్తించారు. దీంతో ఆమెను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు ఆమెకు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. కాగా స్వర్ణలత గతంలో నగరంలో ఆర్ఐగా పనిచేసినప్పుడు నోట్ల మార్పిడి వ్యవహారంలో బెదిరించి డబ్బులు గుంజారనే ఫిర్యాదు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేసింది. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయడంతో బాపట్లలో పోస్టింగ్ ఇచ్చారు.

తూనికలలో మోసాలపై అవగాహన అవసరం

నర్సీపట్నం, మే 8(ఆంధ్రజ్యోతి): కూరగాయలు, మాంసం, చేపల మార్కెట్లు, బియ్యం, కిరాణా షాపులలో జరుగుతున్న తూనికల మోసాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని నర్సీపట్నం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపారు. గురువారం చింతపల్లి రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల కూరగాయల మార్కెట్లో దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలి

మాకవరపాలెం, మే 8(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము కోరారు. పిల్లలను పాఠశాల చేర్పించేందుకు గురువారం ఇంటింటా సర్వే చేపట్టారు.

వైభవంగా మరిడి మహాలక్ష్మి పండుగ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మే 8(ఆంధ్రజ్యోతి): బలిఘట్టం శ్రీమరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగను వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పెద్ద జాగరం సందర్భంగా ఆలయం ఆవరణలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఏర్పాటు చేశారు. నేల డ్యాన్సులు, డప్పులు, థింసా నృత్యంతో ఊరేగింపు నిర్వహించారు. గురువారం అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వచ్చారు. పసుపు కుంకుమలు, చీర జాకెట్టు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

అమ్మవారి పండుగ సందర్భంగా ఎడ్ల పందేలు నిర్వహించారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎడ్లుతో పోషకులు పందేలలో పాల్గొన్నారు. మూడు రౌండ్లు గాను 2 నిమిషాల 12 సెకన్లకు గమ్యం చేరుకున్న కేఎల్‌బీపట్నానికి చెందిన బండారు చరణ్ హర్ష మొదటి బహుమతి రూ.15వేలు గెలుచుకున్నారు. తర్వాత 2 నిమిషాల 13 సెకన్లలో గమ్యం చేరుకున్న లెక్కల పాలేనికి చెందిన పైడితల్లమ్మతల్లి ద్వితీయ బహుమతిగా రూ.12వేలు, 2 నిమిషాలు 14సెకన్లలో గమ్యం చేరుకున్న అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడు మూడో బహుమతిగా రూ.10వేలు గెలుచుకున్నారు. తర్వాత ఐదు స్థానాలలో గమ్యం చేరుకున్న ఎడ్లుకి రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు స్పీకర్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగల సందర్భంగా జరిగే సంప్రదాయ ఎడ్ల పందేలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని అన్నారు. పండుగ నిర్వాహకులను ఆయన అభినందించారు. పందేలను వీక్షించేందుకు అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు.





పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కన పోటీలో పరుగు పెడుతున్న జోడు ఎడ్లు

జనసేనలో భారీగా చేరికలు



జనసేనలో చేరిన వారితో పంచకర్ల రమేశ్‌బాబు

నర్సీపట్నం అర్బన్/నాతవరం, మే 8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో గురువారం పెందుర్తి కార్యాలయంలో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నర్సీపట్నం మండలం వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, ఇన్నం రమణ, నర్సీపట్నం వైసీపీ సీనియర్ నాయకులు మీసాల సత్యనారాయణ, నాతవరం మండలం వైసీపీ మాజీ యూత్ అధ్యక్షుడు పోలుపర్తి శ్రీనివాస్, రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పసుపులేటి అప్పలనాయుడు, బొగ్గు మోహన్ తదితరులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు అంకితభావంతో పని చేయాలన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి హరినాథ్, అల్లాడ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

దాలింపేటలో ప్రభుత్వ భూమి కబ్జా



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

మాకవరపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా లేఅవుట్ వేసి స్థలాలు విక్రయించిన సంఘటన దాలింపేటలో వెలుగుచూసింది. లచ్చన్నపాలెం పంచాయితీ శివారు దాలింపేటలో సర్వే నంబరు 46లో ఒక ఎకరా 32 సెంట్ల ప్రభుత్వ భూమి వుంది. స్థానిక వ్యక్తి ఒకరు దీనిని ఆక్రమించాడు. దీని పక్కనే వున్న జిరాయితీ భూమిని నర్సీపట్నానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేసి లేఅవుట్ వేశాడు. ప్రభుత్వ భూమిని ఇందులో కలుపుకుని, ప్లాట్లుగా విక్రయించడానికి ప్లాన్ వేశాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తి నుంచి ఇటీవల ఎకరా రూ.13 లక్షలకు అనధికారికంగా కొనుగోలు చేశాడు. పక్కనే వున్న కొండగెడ్డను కూడా చదును చేసి ఆక్రమించాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ ఆదేశాల మేరకు వీఆర్వో చిరంజీవి వెళ్లి, ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తితోపాటు కొనుగోలు చేసిన వ్యక్తిపైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వీఆర్వో తెలిపారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవం



చీడిగుమ్మల గ్రామ టీడీపీ నూతన కార్యవర్గం

గొలుగొండ, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవం జరిగాయి. చీడిగుమ్మల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కామిరెడ్డి గోవింద్‌తో పాటు 12 మందితో కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. అయితే పాకలపాడు, సాలిక మల్లవరం, పప్పుశెట్టిపాలెం, పాతకృష్ణాదేవిపేట, అమ్మపేట టీడీపీ గ్రామ కమిటీలను కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని నర్సీపట్నం సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రస్తుత మండల కమిటీని ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో టీడీపీ మండల కమిటీని ఎన్నుకునేందుకుగాను సమావేశం నిర్వహించేందుకు మండల టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. చీడిగుమ్మలలో టీడీపీ నాయకులు బీమిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా బొడ్డు జమీలు, పాతకృష్ణాదేవిపేట గ్రామ అధ్యక్షుడిగా ముప్పల వరహాలబాబు, సీహెచ్.నాగారుత్తల రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, బొలిశెట్టి పాపారావు, చిట్టిబాబు, పెట్ల నారాయణమూర్తి, ఎలమంచిలి వరహాలబాబు, కె.మల్లేశ్, గొంప వాసు, తదితరులు పాల్గొన్నారు.

పురం గ్రామ అధ్యక్షుడిగా యర్రా మురళీ, కొంగసింగి గ్రామ అధ్యక్షుడిగా కసవరాజు సూర్యప్రకాశ్‌తో పాటు కమిటీ సభ్యులను బుధవారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, సర్పంచులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, ఎలమంచిలి నూకరత్నం, ఎంపీటీసీ సభ్యుడు

సోషల్ ఫారెస్ట్ నర్సరీ పరిశీలన

నర్సీపట్నం, మే 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) దివాన్ మైదీన్ నర్సీపట్నం కలప డిపోలో ఉన్న అటవీశాఖ సామాజిక వన విభాగం నర్సరీని గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శామ్యూల్, సోషల్ ఫారెస్ట్ రేంజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

నాతవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో దోమల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం ఆ కాలనీలోని పలు వీధుల్లో దోమల మందు పిచికారీ చేయించారు. వైద్యాధికారి రాజేశ్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు.

బాల్య వివాహాల నివారణకు అందరూ కృషి చేయాలి

» బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు పి.మంగ

చీడికాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు పి.మంగ కోరారు. మండలంలో జైతవరం గ్రామ సచివాలయంలో బాల్యవివాహాలపై కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి కమిటీ సభ్యులు కృషిచేయాలని సూచించారు. ఈ మేరకు అన్ని పంచాయతీ కేంద్రాల్లో బాల్యసంరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడూరు సత్యవతి, గ్రామ మహిళ కార్యదర్శి బెహరా సుధారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ చిన్నమ్మలు, సచివాలయం, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్త పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్!

» పాఠశాల ప్రారంభం రోజే కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

రోలుగుంట, మే 8(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరిట కిట్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మండలాలకు సంబంధించి స్టాకు పాయింట్లకు జిల్లా అధికారులు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగానే గురువారం రోలుగుంట ఎంఆర్‌సీ భవనానికి పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని ఎంఈఓ జగ్గారావు పరిశీలించి, స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. పాఠశాలలు ప్రారంభం అయిన తొలిరోజు నుంచే వీటిని విద్యార్థులకు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 1వ తరగతి నుంచి 10 వరకు 9,790 పాఠ్యపుస్తకాలు, వాటికి సంబంధించి వర్క్‌బుక్స్ వచ్చినట్లు తెలిపారు. ఇంకా 2వేల పుస్తకాలు రావాలని, అవి కూడా ఈ వారంలో స్టాక్ పాయింట్‌కు వస్తాయని ఎంఈఓ తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

బుచ్చెయ్యపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): గురువారం వైశాఖశుద్ధ ఏకాదశి సందర్భంగా వడ్డాది గ్రామంలో సర్వమంగళదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 152వ వార్షిక కల్యాణమహోత్సవాలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాంపల్లి నాగేశ్వరరావు, విశ్వంబరశర్మ, దొంతుకుర్తి సంతోశ్ ఆధ్వర్యంలో వైస్‌ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి దంపతులు కల్యాణ వేడుకలను జరిపించారు.

అపరిచితులతో జాగ్రత్త

» ఎస్ఐ ఎం. రఘువర్మ

రావికమతం, మే 8 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులతో షాపుల నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై ఎం.రఘువర్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలో శివారులో పాన్‌షాపుల నిర్వాహకులకు ఆయన గురువారం చిల్లర దొంగతనాల నియంత్రణపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులు మద్య పెట్టి దొంగతనాలకు పాల్పడతారని చెప్పారు. వారి ప్రవర్తనపై అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై చెప్పారు. అనంతరం వాహనాల ఈ చలానా వసూలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొబైల్ యాప్, మీసేవ కేంద్రాలలో బకాయిలను కట్టించారు.

'గుర్రపుగెడ్డపై వంతెన నిర్మించాలి'

బుచ్చెయ్యపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొట్టిదొరపాలెం గ్రామస్థులు వ్యవసాయ, కూలీలు పనుల కోసం గుర్రపుగెడ్డను దాటి వెళ్లి వస్తున్నారు. గుర్రపుగెడ్డ ప్రవాహంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అనేకం. ఈ సమస్య పరిష్కారానికి రైతులు కోరగా చోడవరం జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు, రైతులతో గుర్రపుగెడ్డ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. గెడ్డమీద వంతెన నిర్మాణం అవసరమని సంబంధిత అధికారులతో మాట్లాడారు.

ఘనంగా కల్యాణోత్సవాలు



స్వామి వారి కల్యాణం చేయిస్తున్న అర్చకులు

రావికమతం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్తకోటలో శ్రీదేవి, శ్రీ భూదేవి సమేత కేశవ స్వామి, రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడే ఉన్న శివ, కేశవుల ఆలయాల్లో ఒకే ప్రాంగణంలో ఏటా దేవదాయ శాఖ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆలయాలను వందల ఏళ్ల క్రితం నిర్మించారు. శివాలయంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత రాజలింగేశ్వరస్వామికి, కేశవ ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవస్వామికి వైశాఖ మాసం ఏకాదశి కావడంతో ఈ కల్యాణ వేడుకను నిర్వహించారు. శివాలయ చైర్మన్ గుమ్ముడి గోవింద్, కేశవ ఆలయ చైర్మన్ కోట నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆలయ ఈవో ఆశాకిరణ్మయి పర్యవేక్షణలో కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన గెడ్డం రాము లక్ష్మిజ్యోతి, కోట దిలీప్ ఇందు దంపతుల చేతుల మీదుగా అర్చకులు సాయి, విజయ భాస్కర్ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నీలవేణి పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం

మాడుగుల, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఉన్నా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. చల్లని గాలులు వీస్తూ తేలికపాటి వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు.

పనసకు గిరాకీ

చీడికాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం సంతలో పనసపండ్లకి గిరాకీ పెరిగింది. గురువారం ఉదయం 8గంటలకే సంతకు వివిధ గ్రామాల నుంచి పనస పండ్లను తీసుకువచ్చారు. మైదానప్రాంత వ్యాపారులు నాణ్యతనుబట్టి వంద నుంచి రూ. 120లతో పనసపళ్లను కొనుగోలు చేశారు.

'సమస్యలు పరిష్కరిస్తా'

చీడికాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హామీ ఇచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలతో త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని పంచాయతీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. 46 పంచాయతీల్లో అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని, వచ్చే ఏడాది మరో 46 పంచాయతీలకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పనులకు నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది పంచాయతీకి ఐదు చొప్పున పశువులషెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రెండో విడత ప్రజాదర్బార్ జూన్ నెలాఖరున ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు పూర్తిగా నాశనం

దేవరాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-వాలాబు రోడ్డు అధ్వాన్నంగా తయారయింది. కూటమి ప్రభుత్వంలో దేవరాపల్లి మండలంలో వాలాబు పంచాయతీకి శివారు గ్రామాలకు రూ.9 కోట్లుతో సిమ్మెంటు రోడ్లు నిర్మించారు. కానీ నిర్మాణంలో భాగంగా లోడుతో లారీలు తిరగడం వలన దేవరాపల్లి-వాలాబు పూర్తిగా నాశనం అయ్యింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊళ్లలో కొత్త రోడ్లు వేశారు. కానీ మేయిన్ రోడ్డు నాశనం అయింది.

విఘ్నేశ్వరుడి ఆలయం ప్రారంభం

దేవరాపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లిలో ప్రసన్న వినాయకుడి గుడి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు. సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై 20నఒక రోజు సమ్మె

కె.కోటపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 20వ తేదీన ఒక రోజు సమ్మె చేస్తున్నామని సీఐటీయూ మండల కార్యదర్శి ఈ. నాయుడుబాబు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి, మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టు రూ.21వేల వేతనం ఇవ్వాలని, హైకోర్టు తీర్పు ప్రకారం టెండర్ విధానాన్ని రద్దు చేసి పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కార్మికులకు గ్లౌజులు, సబ్బులు, నూనెలు, ఇతర పనిముట్లు అందజేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా రూ.5 లక్షల వరకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, మండల ప్రజా సంఘాల కన్వీనర్ యర్రా దేవుడు, రైతు సంఘం మండల కార్యదర్శి వనం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

» తహశీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహశీల్దార్ పి.లక్ష్మీదేవి అన్నారు. సివిల్ సప్లై డి.టి.సాయితో కలసి గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొత్తగా పెళ్లయినవారు అత్తవారి ఇంటిదగ్గర వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పిల్లల జనన ధ్రువ పత్రంతో స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే విచారణ అనంతరం 180 రోజుల్లో కొత్త రేషన్ కార్డులో పిల్లల పేరు చేరుస్తామని చెప్పారు. 15 ఏళ్ల దాటిన వారు నేరుగా తహసీల్దార్‌కు దరాఖాస్తు చసుకోవాలని ఆమె సూచించారు.

'డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి'



గిరిజన సంక్షేమ శాఖ ప్రధానకార్యదర్శి నాయక్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

పాడేరు, మే 8(ఆంధ్రజ్యోతి): జీవో 3 రద్దు నేపథ్యంలో అదే స్థాయిలో గిరిజనులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని కోరుతూ స్పెషల్ డీఎస్సీ సాధన సమితి నేతలు గురువారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్టు సాధన సమితి నాయకులు స్థానిక విలేకరులకు తెలిపారు. తమ వినతిని పరిశీలించిన ఆయన జీవో 3కు ప్రత్యామ్నాయంగా జీవో తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ సాధన సమితి నేతలు పి.అప్పలనర్స, కె.రాధాకృష్ణ, ఆర్.జగన్మోహనరావు, ఎస్.మాణిక్యం, కె.సురేంద్ర, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి క్యాంప్ గ్రామ శివారుల్లో ఉపాధి హామీ పనులు

సీలేరు, మే 8 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలోని చింతపల్లిక్యాంప్ గ్రామ శివారున రూ. లక్షా 22 వేల ఉపాధి నిధులతో చెరువు ప నులను గురువారం స్థానిక సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ సభ్యులు పి. సాంబమూర్తి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా గిరిజనులను కోరా రు. ఈ పూడిక తీత పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కె. వల్లీప్రసాద్, టీడీపీ నాయకుడు కె. సన్యాశిరావు, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, వార్డు సభ్యుడు సిరుపతి, బీఆర్పీ పృధ్వీ తదితర్లు పాల్గొన్నారు.

బాల, బాలికలకు వేసవి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాల, బాలికల్లో వివిధ అంశాల్లో సామర్థ్యం పెంపునకు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఏవీవీ కుమార్, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వెల్ఫేర్లు, మహిళా పోలీసులతో గురువారం సమావేశమయ్యారు. ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వివరాలను సమాచారం సేకరించాలని, అలాగే విద్యార్థులకు బోధించేందుకు గ్రామాల్లో పదో తరగతి, లేదా డిగ్రీ చదువుకున్న వారిని వలంటీర్లు నియమించి, ప్రథమ పోర్టల్ యాప్‌లోని వారి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



రైతులకు డ్రమ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు,

జి.మాడుగుల, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్గానిక్ పద్ధతిలో పసుపు అధిక దిగుబడి సాధనకు ఎఫ్‌పీవో కృషి చేస్తుందని శ్రీమత్స్యదేవత రైతు ఉత్పత్తిదారుల సేవ సంఘం సీఈవో ఐసారం హనుమంతరావు తెలిపారు. ఎఫ్‌పీవో ద్వితీయ వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం పెదలోచలిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేశ్, భారతీయ చిరుధాన్యాల సంస్థ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్, జీఎంసీ సంస్థ అభిషేక్, కాఫీ బోర్డు అధికారి రమేశ్, ఎస్‌వీడీఎస్ నుంచి మహిమ, ఐఐఎంఆర్ నుంచి కె.శ్రీనివాస్ పాల్గొని ఎఫ్‌పీవో రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. సీఎస్ఎం నుంచి అభిషేక్ మాట్లాడుతూ, సంఘం రైతులకు ఫెయిర్ ట్రేడ్ సర్టిఫికేషన్ ఇవ్వడం ద్వారా మార్కెట్లో కాఫీ, మిరియాలను ఆశించిన ధరలకు విక్రయాలుచేయవచ్చునని చెప్పారు. అనంతరం ఎఫ్‌పీవో రైతుల కు ఉచితంగా డ్రమ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో చైర్మన్ కొండబాబు, సీఎస్ఎం, ఎన్‌జీవో సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు అరకులోయలో శాప్ చైర్మన్ పర్యటన

పాడేరు, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు శుక్రవారం అరకులోయలో పర్యటిస్తారని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటే సురేశ్‌కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. రవినాయుడు శాప్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లాలోని తెలుగు యువత నేతలతోపాటు రాష్ట్ర, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో ఉన్న తెలుగు యువత సభ్యులంతా విధిగా హాజరై పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక

గూడెంకొత్తవీధి, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ బలోపేతం చేస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేశ్ అన్నారు. గురువారం రింతాడ పంచాయతీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా వాడేలు పాండురాజు, ప్రధాన కార్యదర్శిగా సెగ్గె సంజీవరావు, మొ ట్టడం శరభన్నదొర, ఉపాధ్యక్షుడిగా వాడేలు పాండురాజు, కోశాధికారిగా రాజు, కార్యదర్శులుగా జల్లి లక్ష్మమ్మ, సాగిన చిన్నయ్యపడాల్, కిల్లో సింహాచలం, తగ్గి శ్రీరాములు, మండపల లక్ష్మి, సోమెల లోవకుమారిలు ఎన్నికయ్యారు. సీనియర్ నాయకుడు పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, ఆలయ కమిటీ చైర్మన్ దాసుబాబు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

అరకులోయ,మే 8 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో గురువారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర, ఆలయకమిటీ చైర్మన్ పెట్టెలి దాసుబాబులు పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఈ కల్యాణంలో 30 జంటలు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు తిలకించారు. సత్యసాయిట్రస్టువారు వెయ్యిమందికి భగవద్గీత పుస్తకాలు,బాదం పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తను సహకారం అందిస్తానన్నారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారి పెండ్లి మాటలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ఊరేగింపుగా ఆడపెళ్లివారిగా వ్యవహరించిన పట్టణంలోని బుక్‌స్టాల్ వ్యాపారి రంగా నారాయణ మూర్తి ఇంటి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రధాన అర్చకులు బాలగణేశ్ మంత్రోచ్ఛరణల మధ్య ఆడపెళ్లి వారి తరపున రంగా నారాయణ మూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెండ్లిమాటలాడారు. అనంతరం స్వామి వారి ని తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ నెల 10 వ తేదీవరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

అరకులోయలో పండగ శోభ

వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలతో అరకులోయ పట్టణంలో పండగ శోభ సంతరించుకుంది. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుదీపాలను అలంకరించారు. మధ్యలో పలు దేవతామూర్తులు ప్రతిమలు లైటింగ్‌తో ఏర్పాటు చేశారు. నాలుగురోడ్ల కూడలిలో వెంకటేశ్వరసామి, అలివేలు మంగల దేవతామూర్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

'దివ్యాంగులను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ'



చిన్నారులకు ట్రైసైకిళ్లను అందించిన కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, మే 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన దివ్యాంగ బాలల భవిత కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. భవిత కేంద్రాల్లో అందించే సేవలపై దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు భవిత సెంటర్లను సందర్శించి అక్కడ చిన్నారులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. బాలలు రోజువారీ పనులు ఎలా చేయాలో నేర్పించాలన్నారు. ఇందులో భాగంగా రాయడం, చదవడం, జీవన, సమాచార నైపుణ్యాలను నేర్పించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో భాగంగా సర్వశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో 80 మంది దివ్యాంగ చిన్నారులకు భవిత కిట్‌లను, ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, సర్వశిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ స్వామినాయుడు, ఐఈసీ సమన్వయకర్త కె.భాస్కరరావు, ఎడ్యుకేషన్ రీసోర్సుపర్సన్లు, దివ్యాంగ చిన్నారులు, వారి తలిదండ్రులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

యూబీఐ విజయనగరం రీజియన్ హెడ్ జితేంద్రశర్మ



మహిళా సంఘాలకు రూ.5కోట్ల చెక్‌ను అందిస్తున్న యూబీఐ హెడ్ జితేంద్రశర్మ, డీఆర్‌డీఏ పీడీ మురళి, తదితరులు

పాడేరు, మే 8(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయనగరం రీజియన్ హెడ్ జితేంద్రశర్మ అన్నారు. స్థానిక కాఫీహౌస్‌లో గురువారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఏజెన్సీలోని స్వయం సహాయక సంఘాలకు రూ.5 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో యూబీఐ జోనల్ హెడ్ నటేశ్, డిప్యూటీ హెడ్ ఆర్‌హెచ్.రాజా, ఎల్‌డీఎం మాతునాయుడు, పలు యూ నియన్‌బ్యాంకుల బీఎంలు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు: డీఎంవో తులసి

చింతపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) తులసి అన్నారు. గురువారం మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలించారు. మలేరియా ఉద్యోగులు, పిచికారి కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఎంవో మాట్లాడుతూ ఏజెన్సీలో మలేరియా అదుపులో ఉందన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రధానంగా గృహ పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. గిరిజనులు రాత్రి వేళ దోమ తెరలను వినియోగించాలన్నారు. అలాగే గత ఏడాది రెండు కంటే అధికంగా మలేరియా కేసులు నమోదైన గిరిజన గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ ఏప్రిల్ 15 నుంచి ప్రారంభించామన్నారు. జూన్ 15 వరకు జిల్లా వ్యాప్తంగా 1,503గ్రామాల్లో దోమల మందు పిచికారి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 40శాతం పిచికారీ పూర్తి చేశామన్నారు. ఈ ఏసీఎం మందు పిచికారీ చేసిన 45రోజుల వరకు గృహాన్ని అలకడంగాని, సున్నం వేయడంగాని చేయరాదన్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, ఏఏఎంవో నీలకంఠం, సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు, ఎంటీఎస్ గుమ్మ యుగంధర్, తాజంగి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో స్వామి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



తాజంగిలో నిలువ నీటి కుండీలను పరిశీలిస్తున్న ఏఎంవో తులసి

వివాహిత అనుమానాస్పద మృతి

కొయ్యూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొమ్మిక పంచాయతీ శివారు బొర్రంపేటలో వివాహిత అనుమానాస్పద రీతిలో ఉరి వేసుకుని మృతిచెందింది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై మృతురాలి తల్లి తండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటరమణ , ఎస్‌ఐ కిశోర్‌వర్మ సిబ్బందితో బొర్రంపేట వెళ్లి పరిశీలించారు. సీఐ అందించిన వివరాల ప్రకారం గంగవరం మండలం జడేరు గ్రామానికి చెందిన కానా వెంకట రమణ, అర్జునమ్మ కుమార్తె రాజారాణి(25)ని బొర్రంపేటకు చెందిన సెగ్గె ప్రసాద్ ప్రేమించి నాలుగేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. బుధవారం రాత్రి వంట చేసుకునేందుకు కట్టెలు కావాలని మావయ్య సూరిబాబును రాజారాణి అడిగింది. తన కాలు బాగోలేదని, నీ భర్త వెంకటరమణకు చెప్పాలని ఆయన సూచించారు. ఈ క్రమంలో మామ, కోడలి మధ్య గొడవ జరిగింది. రాజారాణి ఇంట్లోకి వెళ్లి చున్నీతో దూలానికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించడంతో మామ, అత్త చూసి కేకలు వేశారు. ఇరుగుపొరుగు వారి సాయంతో రాజారాణిని కిందకు దించారు. ఆటోలో కంఠారం పీహెచ్‌సీకి తరలిస్తుండగా దారిలో మృతిచెందింది. అయితే భార్య మృతిపై ప్రసాద్ గురువారం ఉదయం పోలీసుల స్టేషన్‌కు వచ్చిన రాజారాణి భర్త ప్రసాద్.. ఈ సంఘటనపై పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. తరువాత గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే రాజారాణి తల్లితండ్రులు అక్కడికి చేరుకున్నారు. కుమార్తె శరీరంపై గాయాలు వుండడంతో హత్య చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్నదాత సుఖీభవకు రిజిస్ట్రేషన్లు

చింతపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. గిరిజన రైతులు రైతు సేవా కేంద్రానికి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని వెళ్లి ఈనెల 16లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ పరారీ

ఆరిలోవ (విశాఖపట్నం), మే 8 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీ ఒకరు పోలీసుల కళ్లుగప్పి పరారైనట్టు విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన నామాల నాగరాజు గత నెల విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో గల ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అతడిని పట్టుకోవడానికి పోలీసులు విజయవాడ వెళ్లారు. పోలీసులను గమనించిన నాగరాజు తప్పించుకునే క్రమంలో రెండంతస్థుల మేడ పైనుంచి దూకాడు. దీంతో వెన్నుపూసకు గాయాలయ్యాయి. కదలలేని స్థితిలో ఉన్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని తొలుత చికిత్స అందించి, అనంతరం ఏప్రిల్ 13న కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నాగరాజుకు రిమాండ్ విధించింది. అయితే తీవ్ర గాయాల పాలైన అతడిని పోలీసులు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ ప్రిజన్ సెల్‌లో ఉంచి ఏప్రిల్ 19 నుంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు గురువారం శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 7:30 గంటల సమయంలో టిఫిన్ చేయడానికి చేతికి ఉన్న బేడీలను విధుల్లో ఉన్న ఏఆర్ పోలీసులు తొలగించారు. కొంతసేపటి తర్వాత పోలీసులు కళ్లుగప్పి నాగరాజు అక్కడ నుంచి అదృశ్యమైనట్టు ఏఆర్ సిబ్బంది తన దృష్టికి తెచ్చినట్టు జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా, 16 రోజుల క్రితం ఇదేవిధంగా కోర్టు నుంచి వస్తున్న ఒక రిమాండ్ ఖైదీ పారిపోయాడు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తాజాగా ఇప్పుడు మరో రిమాండ్ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోవడం విస్మయం కలిగిస్తోంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పెదబయలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీఎల్ పాడేరు ఇన్‌చార్జి ఏఈ ఎల్‌సీహెచ్.పాత్రుడు తెలిపారు. పెదబయలు, కుమ్మరిపుట్టు, రోగులపేట గ్రామాల ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రైస్ పుల్లింగ్ ముఠా అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

నర్సీపట్నం రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల దాటిన తర్వాత నెల్లిమెట్ట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చింతపల్లి వైపు నుంచి వస్తున్న కారుని ఆపారు. వెంటనే ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పరారయ్యారు. కారులో వున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.10 లక్షల నకిలీ నోట్లు (పిల్లలు ఆడుకునే నోట్లు), రూ.2.6 లక్షలు అసలు నోట్లు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరానికి చెందిన నిమ్మల మనోహర్, తమ్మినేని సుమంత్‌కుమార్, నిమ్మల మన్మథగా గుర్తించారు. వీరిని స్టేషన్‌కు తీసికొచ్చి విచారించారు. ఏజెన్సీ గిరిజనులను లక్ష్యంగా చేసుకొని రైస్ పుల్లింగ్ నాణెం పేరుతో డబ్బులు సంపాదిస్తున్నట్టు చెప్పారు. సీతారాముల పట్టాభిషేకం బొమ్మతో వున్న నాణేనికి ఎన్నో మహిమలు వుంటాయని, ఆ నాణెం కోట్లాది రూపాయల విలువ చేస్తుందని నమ్మిస్తామని చెప్పారు. దీంతో తమ మాటలు నమ్మి నాణెం కొనడానికి ఆసక్తి చూపుతారని, నాణెం కొనుగోలు చేస్తామని చెప్పిన వారికి సెల్ ఫోన్‌లో ఫొటో చూపించి అడ్వాన్స్‌గా కొంత సొమ్ము తీసుకుంటామని తెలిపారు. త్వరలో నాణెం పంపుతామని చెప్పి అక్కడి నుంచి ఉడాయిస్తామని, సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తామని చెప్పారు. కాగా కారును ఆపి తనిఖీ చేసేటప్పుడు పరారైన ఇద్దరు వ్యక్తులు అరకులోయకు చెందిన వారిగా గుర్తించామని, రైస్ పుల్లింగ్ నాణెం కేసులో వీరిని ఏ-1, ఏ-2గా గుర్తించామని సీఐ తెలిపారు. వీరి కోసం గాలిస్తున్నామని, వీరు పట్టుబడితే రైస్ పుల్లింగ్ నాణేం పేరుతో మోసపోయిన బాధితులు ఎవరో తెలుస్తుందని సీఐ చెప్పారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ధర్నా నేడు

పాడేరురూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణ, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఏపీటీఎఫ్ పిలుపు మేరకు ఈ శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల జగన్మోహనరావు, కొర్ర ధనుర్జయ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమస్యల సాధనకు ఈ నెల 5వ తేదీన రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈస్థితిలో 9వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన చేపడుతున్నారు. ప్రతీ గ్రామంలో 1 నుంచి 5వ తరగతులతో మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ పాఠశాలలు గానే కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండు ఎస్‌జీటీ పోస్టులు ఉండేలా చూడాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కొన సాగుతున్న చోట 6, 7 తరగతులు ఉంటే 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 8వ తరగతి ఉంటే 6 స్కూల్ అసిస్టెంట్లు కేటాయించాలన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను విస్తరించాలి: కలెక్టర్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ

పాడేరు, మే 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింతగా విస్తృత పరచాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపకుడుజీన్ హెన్రి దునాట్ చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు, రోగుల అవసరాలకు అనుగుణంగా రెడ్‌క్రాస్ సేవలందించేందుకు సొసైటీలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నూతన జిల్లా కార్యవర్గం పనితీరును కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించి, పలువురు వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్రా నాగరాజు, ఉపాధ్యక్షుడు ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరిశంకర్, కోశాధికారి పి.సూర్యారావు, సభ్యులు ప్ర సాద్, జయలక్ష్మి, సంజీవరావు, రవి, శ్రీనివాస్, జి.సుబ్రహ్మణ్యం, తదతరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ కిట్లు పంపిణీ



క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేస్తున్న ఐటీ టీమ్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్

పాడేరురూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వంతో ప్రతీ కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ క్రియా వాలంటీర్, ఐటీ టీమ్ కో-ఆర్డినేటర్ సీహెచ్.అనీల్ కుమార్ అన్నారు. జనసేన అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్.వంపూరి గంగులయ్య ఆదేశాలపై గురువారం ఆయన పాడేరు పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవణ్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సభ్యత్వం పొందిన సభ్యుడికి ప్రమాద సమయంలో వైద్య ఖర్చులకు రూ. 50 వేలు, ప్రాణ హాని జరిగితే వారి కుటుంబానికి రూ. 5 లక్షలు పార్టీ నుంచి భరోసా కల్పిస్తామన్నారు. అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొర్రా కమల్ హసన్, అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత, సీనియర్ నాయకులు అయ్యప్పపాత్రుడు, ముదిలి సుబ్బారావు, కంఠ సుమన్, ఉల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ: :ఏసీడీపీవో



ర్యాలీలో కిశోర బాలికలు, ఏసీడీపీవో రామలక్ష్మి

చింతపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాజెక్టు ఐసీడీఎస్ ఏసీడీపీవో రామలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాపురం,మల్లవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం, వేసవి సెలవుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీడీపీవో మాట్లాడుతూ యుక్తవయస్సులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. వివాహ వయస్సు రాకుండగా బాల్యవివాహాలు చేయరాదన్నారు. శరీరంలో కలుగుతున్న మార్పులను, సమాజంలో ఏవిధంగా మెలగాలనే విషయాలను బోధించాలన్నారు. మహిళ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. సోషల్ మీడియం, అపరిచిత పరిచయాలు, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కె. విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉన్నీష, ఎస్. గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు చెల్లించాలి

అరకులోయ, మే 8 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన జన్‌మన్ ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గెమ్మెలి చిన్నబాబు, గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పెదగంగగుడి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను గురువారం వారు పరిశీలింరు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు లింటల్ స్థాయిలో నిర్మాణం పూర్తయినా, బిల్లులు చెల్లించకపోవడంతో పనులను నిలిపివేస్తున్నారన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పనులకు ఆటంకంగా మారింది. త్వరితగతిన బిల్లులు చెల్లిస్తే నిర్మాణాలు పూర్తి చేస్తారన్నారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పీవీటీజీ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల రెసిడెన్షియల్(పీవీటీజీ- బాలురు) అరకు విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో లాటరీ పద్ధతి ద్వారా 3వ తరగతిలో ప్రవేశాలకు, అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిఉన్న సీట్లు భర్తీకి ఆ సక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో డాక్టర్.ఎంజే.అభిషేకల్ గౌడ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 80 సీట్లు, 4వ తరగతిలో 45, 5లో 7, 6లో 1, 7లో 2, 8లో 3, 9వ తరగతిలో 1 సీటు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు అరకు ఏపీటీడబ్ల్యూఆర్.స్కూల్ ప్రిన్సిపాల్‌కు నేరుగా ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సమీపంలో ఉన్న గురుకుల విద్యాలయాల్లో లేదా కన్వీనర్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్.మూర్తి ఫోన్ 9493758072, 9490957219కు సంప్రదించాలన్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాలు విడుదల

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన స్కూలు అసిస్టెంట్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఇంకా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ పోస్టుల కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లతో కూడిన తాత్కాలిక సీనియారిటీ జాబితా కూడా విడుదల చేశామని గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాలు 'సైట్స్.గూగూల్.కామ్,సైట్స్. డీఈవో వైజాగ్-2' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలలోగా తగిన ఆధారాలతో తెలియజేయాలన్నారు. అభ్యంతరం వ్యక్తంచేసిన ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయిరాలి పేరు, ప్రస్తుతం పనిచేస్తున్న హోదా, ఎక్కడ పనిచేస్తున్నారు? స్కూలు యూడైస్ కోడ్, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలని సూచించారు. అభ్యంతరాలు మార్పు చేయడానికి కావల్సిన ఆధారాలు, సాక్ష్యాలు తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు.

పాడి రైతుల నెత్తిన పాలు

... 5వ పేజీ తరువాయి

జమ చేస్తారు. పాల సేకరణ ప్రారంభం తరువాత పశువులకు దాణా కోసం ప్రతి రైతుకు రూ.50 వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. కాగా అన్ని జిల్లాల్లో 1964 సహకార సంఘాల చట్టం నిబంధనల మేరకు మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ప్రతినిధి రాకేశ్ తెలిపారు. సంఘాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతుందని, త్వరలో పాల సేకరణ ప్రారంభిస్తామన్నారు. ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండే డెయిరీలకు రైతులు పాలు విక్రయించవచ్చునని, ఈ విషయంలో ఎటువంటి ఒత్తిడి, షరతులు లేవన్నారు.

నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు రాజు



విశాఖలో భువనేశ్వరిని సత్కరించిన రాజు

సబ్బవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని విశాఖ ఎయిర్‌పోర్టులో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీ ఎస్‌ఎన్ రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనం తరం శాప్ చైర్మన్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు రవినా యుడును కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలపై రవినాయుడు ఆరా తీసినట్టు రాజు తెలిపారు.

దర్శకుడు శైలేష్ కొలనును కలిసిన మళ్ల సురేంద్ర


శైలేష్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న సురేంద్ర

కొత్తూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మూడు హిట్ పిక్చర్స్ దర్శకుడు శైలేష్ కొలనును గురువారం రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. డైరెక్టర్ శైలేష్ కొలను ఇప్పటి వరకు అడవి శేష హీరోగా హిట్, వెంకటేష్ హీరోగా సైంధవ్, తాజాగా నాని హీరోగా నటించిన హిట్-3 చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో తెలుగుయువత నాయకుడు మరపురెడ్డి సత్యనారాయణ సోదరుడు, అసిస్టెంట్ డైరెక్టర్ మురళీ వివాహానికి శైలేష్ వచ్చారు. భవిష్యత్తులో మరెన్నో చిత్రాలు పెద్ద హీరోలతో తీయాలని సురేంద్ర ఆకాంక్షించారు.

పదో అదనపు జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ తుహిన్‌సిన్హా


జడ్జికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పదో అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన వి. నరేష్‌ని గురువారం జడ్జి చాంబర్‌లో ఎస్పీ తుహిన్‌సిన్హా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జడ్జికు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లాలో ఇటీవల పెరుగుతున్న గంజాయి కేసులు, ఇతర నేరాల పరిణామాలపై ఎస్పీ జడ్జికి సమగ్ర వివరాలను అందజేశారు. జడ్జిని కలిసిన వారిలో అనకాపల్లి టౌన్ ఎస్‌ఐ దాసరి ఈశ్వరరావు ఉన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పరవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందేందుకు ఈనెల 20వ తేదీలోగా రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్. చంద్రావతి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20వేలు అందిస్తుందన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రూ. ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14వేలతో కలిపి రూ.20వేలు మూడు దఫాలుగా రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సహాయం అందించేందుకు పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు వి. నరేష్ ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆధార్ కార్డు జెరాక్స్, విద్యార్హత పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఒక స్టాంప్ సైజ్ ఫొటో, ఇతర సంబంధిత పత్రాలు అనకాపల్లి కోర్టులో గల మండల న్యాయ సేవాధికార సంఘం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇందుకు కనీస విద్యార్హత పదో తరగతి అని పేర్కొన్నారు. వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎటువంటి జీతం గాని, పారితోషికం గాని ఉండదని తెలిపారు.

వైభవంగా దుర్గమాంబ పండుగ

లంకెలపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): కన్నూరు గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకొని భక్తులు పూజలు చేశారు. మారుతి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

చదరంగంపై విద్యార్థులకు శిక్షణ

కశింకోట, మే 8 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం చదరంగంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళ్లగింతలాట, లూడో గేమ్స్ నిర్వహించారు. 21 మంది విద్యార్థులకు ఈ శిబిరంలో పాల్గొన్నట్టు గ్రంథాలయాధికారి జగన్ కోరారు.

వెన్నెలపాలెం సర్పంచ్, పంచాయతీ పూర్వ కార్యదర్శిలకు నోటీసులు

పరవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, పంచాయతీ పూర్వ కార్యదర్శి వరలక్ష్మిలకు జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి గురువారం నోటీసులు జారీ చేసినట్టు ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. పంచాయతీ ఆధీనంలో గల ఏసీ కల్యాణ మండపం అద్దెల ద్వారా 2019 ఫిబ్రవరి నాల్గోవ తేదీ నుంచి 2024 అక్టోబరు ఒకటో తేదీ వరకు రూ.69 లక్షల 33వేల 255లు ఆదాయం రాగా దీనిలో సుమారు

15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని డీపీవో ఆదేశం

రూ. 21లక్షల 97వేల 689లు దుర్వినియోగమైనట్టు విచారణలో తేలిందన్నారు. పంచాయతీ ఖజానాకు జమ చేయకుండానే సర్పంచ్, కార్యదర్శి కుమ్మక్కై నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఇదే విషయాన్ని వెన్నెలపాలెం గ్రామానికి చెందిన గొంప మారునాయుడు గతేడాది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టగా రూ.21 లక్షల 97వేల 689లు దుర్వినియోగమైనట్టు విచారణలో తేలిందన్నారు. దీంతో సర్పంచ్, అప్పటి కార్యదర్శి వరలక్ష్మిలు 15 రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని డీపీవో నోటీసులు జారీ చేశారని ఎంపీడీవో ధర్మారావు తెలిపారు. ఇదిలావుండగా వెన్నెలపాలెం పంచాయతీ పూర్వ కార్యదర్శి వరలక్ష్మి ప్రస్తుతం రాంబిల్లి మండలం కొత్తూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. మండలంలోని భరణికంలో ఉపాధి హామీ నిధులు రూ.28.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం ప్రజలకు చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గత ప్రభుత్వం గ్రామాభివృద్ధిని విస్మరించడంతో గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిశెట్టి పూజ, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, స్థానిక నాయకులు బొండా సన్నిదేముడు, పెదిశెట్టి రామారావు, పెదిశెట్టి సత్యారావు, మండలంలో గల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి పండుగ

పరవాడ ప్రజల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ అమ్మవారి పండుగ గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, స్థానిక నాయకులు పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, మజ్జిగ, పుచ్చకాయల ముక్కలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైభవంగా బంగారమ్మ అనుపోత్సవం

సబ్బవరం: మొగలిపురం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం బంగారమ్మ అమ్మవారి అనుపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకొని, విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం తప్పెటగుళ్ళ, కోలాటం, సాముగరిడీలు, నేల డ్యాన్స్‌లు బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు, అనంతరం అనుపోత్సవం జరిగింది. అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వైసీపీ నేత గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందలి రమణ, దొడ్డి ప్రకాశ్, కర్రి కనకరాజు, యడ్ల నాయుడు, ఐడి బాబు, దేముడు, కరక రాము, బైలపూడి దేముడుబాబు, గండి కిశోర్, కర్రి లక్ష్మణ, జామి రమణ పాల్గొన్నారు.

సేఫ్ స్టే యాప్ ఆవిష్కరణ


సేఫ్ స్టే మొబైల్ ఆవిష్కరించి తిలకిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం 'సేఫ్ స్టే' మొబైల్ యాప్‌ను ఎస్పీ తుహిన్‌సిన్హా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సాంకేతికతను వినియోగిస్తూ ఈ యాప్‌ను రూపొందించామని చెప్పారు. హోటళ్లు, లాడ్జిలు, ప్రైవేట్ అతిథిగృహాల్లో అద్దెకు దిగే వాని వివరాలను ఇందులో నమోదు చేయడం ద్వారా వారికి నేర చరిత్ర ఉన్నది, లేనిది పోలీస్ డేటాతో సరిపోల్చి చూడవచ్చునని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు అయితే తగు చర్యలు తీసుకునేందుకు ఈ యాప్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ అండ్ సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండు వెంకటరావు పాల్గొన్నారు.

తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్

తుమ్మపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సమ్మర్ ఓరియేంటేషన్, స్టోరీ టెల్లింగ్, మాథ్స్ క్లాస్‌లను నిర్వహించారు. జడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు అప్పారావు విద్యార్థులకు పలు అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు.

పేదలను ఆదుకోవడమే సీఎం లక్ష్యం : పీలా


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.12లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రంలో సామరస్య పాలన సాగుతుందని, ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, కర్రి బాబి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తలారి కాశీనాయుడు, కాంద్రేగుల సతీష్, షేక్‌బాబర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కొత్తూరు: అనకాపల్లి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సిఫార్సు మేరకు నియోజకవర్గంలో ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయన్నారు. లక్కరాజు గోవిందరావుకు రూ.45వేలు, నున్న ప్రవీణ్ రూ.2,02693లు, యలమంచిలి నాగలక్ష్మికి రూ.20వేలు, సేనాపతి సంతోషికుమారికి రూ.20వేలు, గోకివాడ దినేష్ రూ.39,222లు చొప్పున మొత్తం రూ.3,25,915లక్షల చెక్కులు మంజూరు చేశామన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి. కోటేశ్వరరావు

పరవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈమేరకు లంకెలపాలెం జంక్షన్ వద్ద గురువారం కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ కింద మార్పు చేసి పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఆ చర్యలను నిరసిస్తూ చేపడుతున్న సమ్మెలో కార్మిక, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి దేముడు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని బెవరేజెస్ హమాలీల వినతి

అనకాపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీలు గురువారం బెవరేజెస్ డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీల యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ హమాలీల కూలిరేట్ల ఒప్పందం ఈ ఏడాది మార్చి 31తో ముగిసిందన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త రేట్లు పెంచి అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 20వ తేదీన సమ్మెకు దిగుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు జె.కనకరమణ, కె.కొండలరావు, జి.మణిరాజు, అప్పలరాజు, నాయుడు, పైడిరాజు, సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఎన్‌టీఏ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) జిల్లా కమిటీ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జీవీఎంసీ ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరినట్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు తెలిపారు. దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని మేయర్ శ్రీనివాసరావు హామీ ఇచ్చారని తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో పెనుమత్స కృష్ణంరాజు, కోట్ని రాంబాబు, ఆరిపాక రాజా రమేష్ పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ నిర్మాణానికి రూ.1.5 లక్షలు విరాళం

సబ్బవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేశ్ గురువారం రూ.1.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాలిశెట్టి సురేశ్‌రాజ్, అండిబోయిన కోటిరాజు, రెడ్డి శ్రీనివాసరావు, పిల్లి మణికంఠ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సాంబమూర్తి కల్యాణం

కశింకోట, మే 8 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో ఉన్న బంగారయ్యపేటలో చౌడేశ్వరి సహిత సాంబమూర్తి కల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాయల మురళీ, పక్కుర్తి సంతోష్ తదితరులు పాల్గొని సాంబమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సబ్బవరం, మే 8 (ఆంధ్రజ్యోతి):దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ జి.రామచంద్రరావు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ శివారు ప్రాంతాల్లో నివసించేవారు వేసవిలో ఊళ్లకు వెళితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్య కూడలల్లో ఉండే షాపులు, దుకాణాలు, విద్యా సంస్థలు, ఇంటి యజమానులు విధిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు

తుమ్మపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో ఎలమంచిలిలో జరిగిన సీపీఐ జిల్లా రెండవ మహాసభల్లో పలు తీర్మానాలు చేశామని చెప్పారు. తాండవ, శారదా నదుల జలాల పరిరక్షణ, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం, అటవీ, బంజరు భూముల్లో గిరిజనులకు పట్టాలు ఇప్పించేలా పోరాటాలు చేయాలని తీర్మానించినట్టు చెప్పారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో కాలుష్య రహిత, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపురాజు, గురుబాబు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని సీహెచ్‌ఓల నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌ఓలు

అనకాపల్లి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. 12 రోజులుగా సమ్మెలో ఉన్న సీహెచ్‌ఓలు గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 రోజులుగా సీహెచ్‌ఓలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం సీహెచ్‌ఓలను పిలిచి చర్చించి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు యమున, సంధ్య, లక్ష్మి, భవాని పాల్గొన్నారు.

రిజర్వు ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత అరెస్టు

సబ్ రిజిస్ట్రార్‌ను బ్లాక్ మెయిల్ చేయడంలో నకిలీ ఏసీబీ సీఐకి సహకరించారని అభియోగం


: స్వర్ణలత (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.స్వర్ణలతను పీఎం పాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన బలగా సుధాకర్ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి...ఏసీబీ సీఐనని చెప్పి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని డబ్బులు డిమాండ్ చేయడంతో పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన సుధాకర్...కార్యాలయంపై తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కేసు కట్టకుండా ఉండాలంటే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ ఒక ఫోన్ నంబర్‌కు కాల్ చేసి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణితో మాట్లాడించారు. 'సీఐ గారు చెప్పినట్టు చేయండి. అంతా ఆయన చూసుకుంటారని' ఆ మహిళా అధికారి చెప్పారని పీఎం పాలెం పోలీసులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పీఎం పోలీసులు...ఏసీబీ ఉన్నతాధికారిగా పేర్కొంటూ ఎవరితో మాట్లాడించారనే దానిపై విచారణ చేపట్టారు. ఆ నంబర్ గతంలో విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం బాపట్లలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న స్వర్ణలతదిగా గుర్తించారు. దీంతో ఆమెను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు ఆమెకు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. కాగా స్వర్ణలత గతంలో నగరంలో ఆర్ఐగా పనిచేసినప్పుడు నోట్ల మార్పిడి వ్యవహారంలో బెదిరించి డబ్బులు గుంజారనే ఫిర్యాదు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేసింది. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయడంతో బాపట్లలో పోస్టింగ్ ఇచ్చారు.